## అంబేద్కర్ విగ్రహంపై దాడిని ఖండిస్తున్నాం : జెడ్పి చైర్మన్ మజ్జి

**విశాలాంధ్ర-భోగాపురం:** బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని,కూటమి ప్రభుత్వం హయాంలో దుండగులు మహనీయుల విగ్రహాలను కూడా వదలడం లేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు ఆరోపించారు. భోగాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ మహోన్నత వ్యక్తి అయినా అంబేద్కర్ అడుగుజాడల్లో అందరు నడవాలని సదుద్దేశంతో అంబేద్కర్ విగ్రహాన్ని అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విజయవాడలో ఏర్పాటు చేశారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పేరు లేకుండా చేయాలనీ అంబెద్కర్ విగ్రహం పై దాడిచేశారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటె విగ్రహంపై దాడిచేసిన వారిని త్వరగా పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేసారు. దీనిపై రానున్న రోజుల్లో శాంతియుతంగా నిరసనలు చేపడతామని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన భాద్యత కూటమి ప్రభుత్వం పై ఉందని గుర్తు చేసారు.

## విద్య ద్వారానే ఉన్నత భవిష్యత్తు

### ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో మంత్రి కొండపల్లి

**విశాలాంధ్ర-విజయనగరం:** విద్య ద్వారా ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. చదువు తమ జీవన విధానాన్ని మారుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. వివిధ గిరిజన కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సంప్రదాయ గిరిజన నృత్యాలు, ఆదివాసీ కళలను ప్రదర్శించి హోరెత్తించారు. హుషారైన గీతాలతో నృత్యప్రదర్శన చేశారు. ముందుగా అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. గిరిజనులంతా బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. సహజవనరుల సంరక్షణకు గిరిజన తెగలు ఎంతగానో పాటుపడుతున్నాయని పేర్కొన్నారు. ఐటిడిఏ ద్వారా ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని అన్నారు. అయినప్పటికీ విద్య, వైద్యం గిరిజనులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావాల్సి ఉందన్నారు. డికెపర్తి గిరిజన గ్రామానికి ఫీడర్ అంబులెన్సులద్వారా వైద్యాన్ని అందిస్తామన్నారు. ప్రతీ గిరిజనుడు కనీసం డిగ్రీవరకైనా చదువుకోవాలని కోరారు. విజయనగరంలో గిరిజనులకోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. డికె పర్తికి రహదారి నిర్మాణానికి, తాటిపూడి రిజర్వాయర్‌లో బోటు షికారు వీలైనంత త్వరగా ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన విశ్వవిద్యాలయాన్ని త్వరగా పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఏ గిరిజన గ్రామంలోనైనా పాఠశాల ఏర్పాటుకు సహకారం అందిస్తామని మంత్రి ప్రకటించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటి పరిరక్షణకోసం ప్రతీఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజనుల సంక్షేమానికి కృషి జరుగుతున్నప్పటికీ, ఇంకా కొన్నిచోట్ల విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గిరిజనులు ఏ సమస్యమీద వచ్చినా పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవనాన్ని వీలైనంత త్వరగా స్వాధీనం చేస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కాలనీలు, గ్రామాలన్నిటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని గిరిజనులు ఉన్నత స్థానానికి ఎదగాలని కలెక్టర్ కోరారు. విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న విద్య, రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవడం ద్వారా గిరిజనులు కొంతమేర అభివృద్ధి చెందారని, ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్లు ద్వారా గిరిజనులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై, తమ వాణి వినిపిస్తున్నారని చెప్పారు. గిరిజన సంక్షేమం కోసం మాన్సాస్ సంస్థ కూడా తనవంతు కృషిచేస్తోందని చెప్పారు. గిరిజనులకోసం మాన్సాస్ సంస్థ చాలా ఏళ్లక్రితమే సుమారు 3వేల ఎకరాలను కేటాయించిందని, ఈ స్థలంలో గిరిజనులకోసం కెజి నుంచి పిజి వరకు విద్యనందించే గొప్ప విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని అదితి కోరారు. జేసీ కె.కార్తీక్, జిల్లా బిసి సంక్షేమాధికారి కిడారి సందీప్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి బి.రామా నందంతోపాటు, వివిధ గిరిజన సంఘాల నాయకులు తుమ్మి అప్పలరాజుదొర, డివిజి శ్యామ్, ఎ.వెంకటరమణ, బి.లక్ష్మణరావు తదితరులు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను వివరించి, వాటిని పరిష్కరిం చాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ తదితర పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన గిరిజన విద్యార్థులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఉన్నతి పథకం ద్వారా 36 మంది గిరిజన మహిళా సంఘాల సభ్యులకు రూ.18,00,000 విలువైన చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిధులను, గిరిజన సంఘాల నాయకులను ఘనంగా సత్కరించారు.

## సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే బేబీ నాయన కు కృతజ్ఞతలు

**విశాలాంధ్ర-బొబ్బిలి:** పట్టణం 8వ వార్డులో జయప్రకాష్ స్కూల్ వద్ద గతవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందిన సంఘటన పాఠకులకు విధితమే.ఈ సంఘటనపై కూటమి ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) అధికారులతో సంప్రదించి తక్షణమే పాఠశాల ముందు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అలాగే, స్కూలుకు ఇరువైపులాస్కూల్ జోన్ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఈ మరమ్మతుల భాద్యతను తీసుకున్న 8వ వార్డు కౌన్సిలర్ రాంబర్కి శరత్ శుక్రవారం మున్సిపల్ డీఈ సునీల్ తో కలిసి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే బేబీ నాయన మాట ఇచ్చిన విధంగా తక్షణమే రోడ్డు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్యే బేబీనాయనకు, కౌన్సిలర్ రాంబర్కి శరత్ ,స్థానికులు ఎమ్మెల్యే బేబీ నాయన కు ధన్యవాదాలు తెలిపారు.

## సీతం, ఎంఎస్‌హెచ్ ఇన్ రీసెర్చ్, పుదుచ్చేరి మధ్య ఎంఒయు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం), ఎంఎస్‌హెచ్ అకాడమీ ఇన్ రీసెర్చ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి మాట్లాడుతూ, సీతం కళాశాలలో అధ్యాపకుల కోసం సదస్సు నిర్వహించడం, సదస్సు అమలుచేయడానికి అవసరమైన బాధ్యతలను వివరించడం, అధ్యాపకుల కోసం ఆధునిక సాంకేతికతలపై దృష్టి సారించేలా బోధన అవలంభించడం ఈ అవగాహన ఒప్పందం యొక్క ప్రధాన లక్ష్యం అని తెలియచేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ అవగాహన ఒప్పందం ద్వారా అధ్యాపకుల పరిశోధన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని, తద్వారా విద్యార్థులు పరిశోధన, అభివృద్ధి కార్య కలాపాలలో కూడా పాలుపంచుకోవచ్చని తెలియచేశారు. డైరెక్టర్ డాక్టర్ ఎం.శశి భూషణరావు సమక్షంలో సీతం ప్రిన్సిపాల్ మరియు ఎం.ఎస్.హెచ్ అకాడమీ ఇన్ రీసెర్చ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ టి.రాజ సంతోష్‌కుమార్ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. కార్యక్రమంలో సీతం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) డాక్టర్ టిడివిఎ నాయుడు, ఆర్.అండ్.డి డీన్ డాక్టర్ వై. నరేంద్ర మరియు అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## జ్యోతిభాపూలే స్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌గా గణపతి

**విశాలాంధ్ర-జామి:** విజయనగరంలోని జమ్ము నారాయణపురంలో ఉన్న మహాత్మాజ్యోతి భాపూలే అంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల నూతన ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌గా జామిమండ లంలోని జన్నివలస గ్రామానికి చెందిన డోల గణపతి ఎన్నికయ్యారు. గురువారం నిర్వ హించిన తల్లిదండ్రుల ఓటింగ్ విదానంలో ఎస్ఎంసీ కమిటీని ఎన్నుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కవిత ఎన్నికలను ప్రభుత్వ నిభందనల మేరకు నిర్వహించారు. చైర్మన్‌గా డోలగణపతిని, వైస్‌చైర్మన్‌గా విజయనగరం వైఎస్ఆర్ నగర్‌కు చెందిన పార్వతిని ఎన్నుకున్నారు.

## మానస దేవుని దర్శించుకున్న మంత్రి కొండపల్లి దంపతులు

**విశాలాంధ్ర-చీపురుపల్లి:** చీపురుపల్లి మండలంలోని పుర్రెవలస రామలింగాపురం గ్రామాల మధ్య వెలసిన శ్రీ మానస దేవి అమ్మవారిని రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ సర్ప్ ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పిన్నింటి రమణ ఈశ్వరమ్మ దంపతులతో పాటు ఆలయ పూజారి ఉత్తం సాయి మంత్రి దంపతులకు ఘనంగా స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులు మానసా దేవికి పంచామృతాభిషేకాన్ని జరి పించారు. అనంతరం ఆలయ ధర్మకర్త దంపతులు మంత్రి శ్రీనివాస్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి గౌరవంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురేవలస సర్పంచ్ సారిక మోహన్రావు రావివలస సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ సామాజిక మహా శిల్పం ధ్వంసం చేయాలనుకోవడం రాజ్యాంగానికి మాయని మచ్చ

### మాజీ ఎమ్మెల్యే శంబంగి

**విశాలాంధ్ర-బొబ్బిలి:** వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సామాజిక మహా శిల్పాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన విషయం మీకు విదితమే. రాజ్యాంగ నిర్మాత మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్ విగ్రహాన్నీ కూల్చేం దుకు కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించడం దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు.ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, కూటమి ప్రభుత్వం నిన్న రాత్రి అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని సుత్తులతో, ఇతర పరికరాలతో ధ్వసం చేసేందుకు బరితెగించారు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ప్రోద్బలంతో ఇంత దారుణానికి ఒడి గట్టారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం వచ్చిన రెండు నెలలుగా రాష్ట్రంలో కక్ష సాదింపు చర్యలు చేపట్టడం తప్పా ప్రజలకు చేసింది కానీ, చేయాల్సింది కానీ ఏమీ లేదన్నారు.ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం కు ఎమ్మెల్యే శంబంగి, మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ రావు, దళిత నాయకులు రాయి రవిలు పాలాభిషేకం చేశారు.

## రహస్య బ్యాలెట్ జరపకపోవడంతో ఎన్నికలు వాయిదా?

**విశాలాంధ్ర-మెరకముడిదాం:** మండలంలో ఐదు పాఠశాలలో పేరెంట్స్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు కోరం లేక వాయిదా పడినట్లు అధికారులు వెల్లడించినప్పటికీ రహస్య బ్యాలెట్ ఓటింగ్ జరిపి ఉంటే వాయిదా పడి ఉండేది కాదని ఆయా గ్రామస్తులు అన్నారు. వివరాల్లోకి వెళ్ళగా... మండలంలో గురువారం జరిగిన పేరెంట్స్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు శాతంవలస ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ఉత్తరావల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల భీమవరం ప్రాథమిక పాఠశాల ఎన్నికలు రసాభాస అయి వాయిదా పడ్డాయి. పై మూడు గ్రామాలు సెన్సిటివ్ గ్రామాలు. అలాంటి పరిస్థితుల్లో ప్రజలు చేతులెత్తడం గాని నోటితో చెప్పడం చేయరు అలాంటి పరిస్థితుల్లో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూడో ఆప్షన్ గా రహస్య బ్యాలెట్ నిర్వహించాలి. కాని రహస్య బ్యాలెట్ విధానం గురించి సంబంధిత హెచ్ఎం ముందుగా తల్లిదండ్రులకు రహస్య బ్యాలెట్ తెలియ పరచలేదు. తెలియపరచి ఉంటే రహస్య బ్యాలెట్ విధానం ద్వారా శత శాతం ఎన్నికలు మండలంలో జరిగి ఉండేది.ఇకనైనా ఆయా గ్రామాల్లోఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా విద్యా కమిటీ ఎన్నికలు జరపాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

## సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులు ట్రైనింగ్ ప్రోగ్రాం

### ఎంపీడీవో లవ రాజు

**విశాలాంధ్ర-డెంకాడ:** కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ సర్పంచులు కార్యదర్శులకు పంచాయతీలో నిర్వ హణ తదితర అంశాలపై మూడు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్(సోమవారం, మంగళవారం, బుధవారం) డెంకాడలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏ లవరాజు ఒక ప్రకటనలో తెలిపారు తప్పనిసరిగా గ్రామ సర్పంచులు కార్యదర్శులు ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం హాజరు అవ్వాలని కోరారు.

## సిటీయూలో యుజీ ఎడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న వవివిద అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ అయిన 1. బిఎస్సీ కెమిస్ట్రీ (నాలుగు సంవత్సరాల నిడివికల హానర్స్ అండ్ హానర్స్ విత్ రిసెర్చ్) 2. బిఎస్సీ బొటని (నాలుగు సంవత్సరాల నిడివికల హానర్స్ అండ్ హానర్స్ విత్ రిసెర్చ్) 3. బిఎస్సీ జియాలజీ (నాలుగు సంవత్సరాల నిడివికల హానర్స్ అండ్ హానర్స్ విత్ రిసెర్చ్) 4. బిఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ (నాలుగు సంవత్సరాల నిడివికల హానర్స్ అండ్ హానర్స్ విత్ రిసెర్చ్) 5. బీబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ (నాలుగు సంవత్సరాల నిడివికల హానర్స్ అండ్ హానర్స్ విత్ రిసెర్చ్) లలో అడ్మిషన్ కొరకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను నోటిఫికేషన్ విడులచేశారు. ఇటీవలే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ( ఎన్ టి ఏ) నిర్వహించిన సి యు ఈ టి(యుజి) పరీక్ష రాసిన వారు అందరూ అప్లై చేయడానికి అర్హులని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని తెలిపారు. అతి తక్కువ ఫీజులతో, అత్యున్నత విద్యా ప్రమా ణాలు గలిగిన విద్యఅందించబడుతుందని, దానితోపాటు విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి కొరకు, ఉద్యోగ ఉపాధి కల్పన కొరకు ప్రేత్యేక శిక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. పైన తెలిపిన యుజీ ప్రోగ్రామ్ లకు అప్లై చేసుకొనదలచిన వారు www.ctuap.ac.in గాని లేదా https://ctuapcuet. samarth. edu.in ద్వారా తమ పేరును 16.08.2024 రాత్రి 11:55 నిమిషాల లోపు రిజిస్టర్ చేసుకోవాలని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ ను లేదా ఫోన్ నెంబర్ 0892296033 ను గాని యూనివర్సిటీ పని వేళలలో సంప్రదించాలని తెలిపారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధి

### ఎమ్మెల్యే లోకం మాధవి

**విశాలాంధ్ర-భోగాపురం:** మండలాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. అభివృద్ధికి, సమస్యల పరిష్కరానికి సహకరిస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఎంపిపి అనుషారెడ్డి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో మండలంలో సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా మండలంలో విద్యుత్ సమస్యలతో సతమమౌతున్నామని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యే ల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే రామచంద్రపేట వద్ద జిఎంఆర్ సంస్థ గ్రామానికి సమీపంలో క్వారీ నిర్వహణ పట్ల ఆందోళన చెబుతున్నామని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విమానాశ్రయ నిర్మాణానికి వేరొక చోట క్వారీకి అనుమతులు ఇచ్చేవరకు ఓపికపట్టాలని,అనంతరం ప్రస్తుతం నిర్వహిస్తున్న క్వారీని నిలిపివేస్తామని ఎమ్మెల్యే అన్నారు. జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున సుందరపేట వైద్యశాలలో ట్రామా కేర్ సెంటర్ ను ఏర్పాటుచేయాలని, అలాగే ఆర్థోపెడిక్ వైద్యున్ని నియమించాల్సిన అవసర ముందని వైద్యులు సూచించారు. తీర ప్రాంత గ్రామాలలో త్రాగు నీటికి ఇబ్బందులు తీర్చాలని తీరప్రాంత గ్రామాల ప్రజాప్రతినిధులు కోరారు. జల జీవం మిషన్ లో భాగంగా ఇంటింటి నీటి సరఫరా కోసం గ్రామాలలో రోడ్లును పాడుచేస్తున్నారని, కుళాయిల ద్వారా తగినంత నీళ్లు రావటం లేదని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. విమానాశ్రయ నిర్వాసితులకు ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయించాలని సభ్యులు కోరారు. కస్తూరిబా పాఠశాల, విమానాశ్రయ భూసేకరణలో పోయిన పాఠశాలల నిర్మాణం గురించి విద్యాశాఖాధికారులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇవేకాక ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలపై సమావేశంలో చర్చించి అధికారులకు జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్యేలు తగు ఆదేశాలు ఇచ్చారు. క్షేత స్థాయిలో సమస్యలపై పురోగతిని ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకెళ్లాలని, అలాగే జిల్లా పరిషత్ నుంచి మండల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని జెడ్పీ చైర్మన్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి మంజులత, వైస్ ఎంపిపిలు రావాడ బాబు, పడాల సత్యవతి, ఎంపిడిఓ చంద్రకళ, తహసీల్దార్ ఎం. సురేష్, సర్పంచ్లు, ఎంపిటిసిలు, మండల అధికారులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ స్వర్ణకార వర్తకసంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అదితి కి ఘన సన్మానం

**విశాలాంధ్ర-విజయనగరం రూరల్ :** పట్టణ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శాసనసభ్యురాలు పూసపాటి ఆదితి విజయలక్ష్మి గజపతి రాజుకు అభినందన కార్యక్రమం జరిగింది. స్థానిక బొండాడ వీధిలో ఉన్న సంఘ భవనంలో ఆమెకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెకు స్వర్ణకార సంఘం ప్రతినిధులు, విశ్వబ్రాహ్మణులు అభినందనలు తెలిపి పుష్పగుచ్ఛాలతో సన్మానం చేశారు.సంఘం అధ్యక్షుడు లక్కోజు శేఖర్, కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో గజమాలలతో ఆమెని సత్కరించారు. ఈ సందర్భంగా శాసన సభ్యురాలు అదితి గజపతిరాజు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సహకార సంఘం ప్రతినిధులు ఒక నివేదిక రూపంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రాతపూర్వకంగా ఇచ్చినట్లయితే వాటి పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. పివిజి రాజు ఈ ప్రాంతానికి, బీసీ వర్గాలకు విద్యాదాతగా ఎంతో సహాయాన్ని అందించారని అన్నారు. నాణ్యమైన విద్యను అందించి ఎంతో మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. సంఘం ప్రతినిధులు శేఖర్, మారోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులను గౌరవించుకోవడం మన సంప్రదాయమని అన్నారు. శాసనసభ్యురాలుగా ఎన్నికైన అదితి గజపతిరాజుని అభినందించి, తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కిల్లంపల్లి ఆచారి, జానా ప్రసాద్, పాలకొల్లు నాని, ముక్కాల శ్రీనివాసరావు, చిన్నబాబు, నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

**విశాలాంధ్ర-లక్కవరపుకోట:** ఈనెల 12 నుంచి 14 వ తేదీ వరకు వరుసగా మూడు రోజులు ఏపీ ఎస్ఐఆర్డీపి విజయవాడ వారి ద్వారా ఆర్జిఎస్ఏ వారు శిక్షణ ఇవ్వనున్నట్లు ఈవో అండ్ పిఆర్ డి, ఇన్చార్జి ఎంపిడిఓ జి. జ్ఞానేశ్వర్ రావు తెలిపారు సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ శిక్షణలో కార్యాచరణ ప్రణాళిక 2024-25 ఆర్థిక సంవత్సరానికి శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ శిక్షణా కార్యక్రమంలో పారిశుధ్య మయిసాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్... గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు అంశాలపై మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ నిర్వహించడం జరుగుతుందని ఈ శిక్షణ కార్యక్రమమునకు 31 గ్రామపంచాయతీ సర్పంచులు కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు.

## రసాయనిక ఎరువులు తగ్గించాలి

**విశాలాంధ్ర-బాడంగి:** రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరు వులు, పురుగుమందులు మీద అవగాహనా కల్పించి కొని, పర్యావరణం, నేల, మానవ ఆరోగ్యం కాపాడుకోవాలని మండల వ్యవసాయధికారి శిరీష. రైతులను కోరారు. ఆమె ఆధ్వర్యంలో శుక్రవారం ముగడ గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులను చైతన్య చేయడం మే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. 14. వారాలు పాటు ఏ ఏ సమయంలో వ్యవసాయ యాజమాన్యం ఎలా చేయాలో ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ వరి పంటలో ఈ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం జిఎపి సర్టిఫికెట్ రైతులుకి వస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో విఎఎ సాయికుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సర్పెంచ్ శివుడునాయుడు, వైస్ సర్పెంచ్ మురళి, డైరెక్టర్ ఈశ్వరావు, గ్రామపెద్దలు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి బాలిక మృతి

**విశాలాంధ్ర-రామభద్రపురం :** గడ్డి మందు తాగి గిరిజన బాలిక మృతి చెందిందని స్థానిక ఎస్సై జ్ఞాన ప్రసాద్ తెలిపారు. శుక్రవారంఆయన తెలిపిన వివరాల ప్రకారం చదరడవలస గ్రామానికి చెందిన డి పొట్టన్నదొర అతని భార్య లక్ష్మి కలిసి పొలంలో గాబు తీయడానికి వెళ్లారు. ఇంటిలో ఎవరు లేని సమయంలో బాత్రూంలో గడ్డి మందు తాగిందని తెలిపారు. ఈ విషయం గమనించిన పక్కింటి వారు తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి బాలికను ప్రశ్నించగా గడ్డి మందు తాగానని సమాధానం చెప్పడంతో స్థానికులు సహాయంతో 108 లో బాడంగి ప్రభుత్వాసుపత్రికి వైద్యము నిమిత్తం తీసుకొని వచ్చారు. బాలిక పరిస్థితి బాగో లేకపోవడంతో మరింత మెరుగైన వైద్యం కొరకు జిల్లా కేంద్రస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక శుక్రవారం ఉదయం మరణించిందని ఎస్ఐ తెలిపారు. ఈ మృతికి కారణం తండ్రి కుమార్తెను మందలించడంతో ఆమె మనస్థాపము చెంది పురుగులు మందు సేవించిందని తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో ఆదివాసి దినోత్సవాలు

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందు గా అతిరదులు జ్యోతి ప్రజ్వలనం చేసి అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పులమాలను సమర్పించారు. అనంతరం ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామిక వేత్త 21 సెంచరి గ్రూప్ ఆఫ్ బిజినెస్ సీఈవో కె. ధరణి మాట్లాడుతూ గిరిజనుల కి చాలా మంచి అభ్యసనా నైపుణ్యాలు ఉంటాయని వాటిని తగు రీతిలో మాలచితే వారు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలే కాకుండా వ్యాపారాలలో కూడా రాణిస్తారని అందరికన్నా ముందుకు దూసుకు పోతారన్నారు. అనంతరం డీన్ ముక్కామల శరత్చంద్రబాబు మాట్లాడుతూ గిరిజన విశ్వ విద్యాలయం గిరిజన విద్యార్థుల అభ్యున్నతి కొరకు, గిరిజన కళలు, వృత్తులు తదితరమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి మంచి బవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ ప్రపంచంలో చాలా సంవత్సరాలుగా ఆదివాసీలు శాస్త్ర సాంకేతిక అంశాలను పాటిస్తున్నారని నేడు మనం సాధించాం అని చెపుతున్న ఎన్నో అంశాలను వారు ఎప్పుడో పాటించేవారని ఇప్పుడు వాటిపై పరిశోదనలు జరుపు తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ చైర్మన్ డా.అనిరుధ్ కుమార్, డా.పి.శ్రీదేవి, డా. బొంతు కోటయ్య, డా. ప్రమా, డా.వెంకటేశ్వర్లు, డా.ఎన్.వి.ఎన్. సూర్యనారాయణ తదితర అధ్యాపకులు, ఆద్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్ధిని విద్యార్థులు గిరిజన నృత్యాలు, పాటలు విద్యారులను ఉర్రూతలూగించారు.

## వితంతు పింఛనుకు దరఖాస్తులో సహాయ సహకారాలకై న్యాయసేవా సంస్థలను ఆశ్రయించాలి

### సీనియర్ సివిల్ జడ్జ్ వివేక్ ఆనంద్‌శ్రీనివాస్

**విశాలాంధ్ర-రాజాం:** మండల న్యాయ సేవా సంస్థ, రాజాం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వితంతు పింఛను పథకంపై రాజాం మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి సి. హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో అధ్యక్షులు మాట్లాడుతూ అర్హులైన వితంతు మహిళలకు వితంతు పింఛను అందజేయాల్సిందేనాని అన్నారు. వితంతు పింఛను పొందనడానికి గల అర్హతలు, ఏ రకముగా దరఖాస్తు చేసుకోవాలో, ఎటువంటిపత్రాలను సమర్పించాలో అవగాహన కలిగించారు. అలాగే వితంతు పింఛనుకు అర్హత కలిగి ఉండి పింఛను అందకపోతే కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వితంతు పింఛనుకు దరఖాస్తు చేసుకోవడములో సహాయసహకారాలకు న్యాయసేవా సంస్థలను ఆశ్రయించాలని తెలియజేశారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న సచివాలయ సంక్షేమ మరియు విద్యా తమ విదులను సక్రమముగా నిర్వర్తించి అర్హులైనవారికి ప్రభుత్వ పథకాలు అందేటట్లు చూడాలని అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని కోరారు. ఈ సదస్సులో రాజాం జూనియర్ సివిల్ జడ్జ్ పి.యెస్.వి.బి.కృష్ణ సాయి తేజ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక స్థిరత్వము కలుగుతుందని, పథకాలు అమలు సక్రమముగా జరిగినపుడే వాటి ఫలితము లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజాం ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వితంతు పింఛను అర్హత, ఇంతవరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమంది లబ్దిపొందుతున్నారో వివరించారు. సదస్సులో రాజాం బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ఈసిహెచ్ జయదేవ్, జాయింట్ సెక్రెటరీ ఏం.శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాది ఆర్. విజయకుమార్: రాజాం, ఆర్.ఏ.వలస సంతకవిటి కార్యదర్శులు, మూడు మండలాల సచివాలయాల వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు రాజాం ఎంపిడిఓ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసి పోలీసుశాఖ ప్రతిష్ట పెంచాలి

### ఎస్పీ వకుల్ జిందల్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్:** జిల్లాపోలీసు పరేడ్ గ్రౌండులో ప్రతీ శుక్రవారం నిర్వహించే సెరిమోనియల్ పరేడ్ కు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిధిగా హాజరై, ఆర్మ్డ్ రిజర్వు సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆర్మ్డ్ రిజర్వు అధికారులు, సిబ్బంది, హెూంగార్డ్సుతో మమేకమై, వారు నిర్వహించే విధులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేసారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ఆర్మ్డ్ రిజర్వు, సివిల్ పోలీసు సిబ్బంది పోలీసుశాఖలో భాగస్వామ్యులైన హోంగార్డ్సు విధి నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మిగిలిన శాఖల ఉద్యోగుల కంటే పోలీసుశాఖ ప్రత్యేకమైనదని, పోలీసు యూనిఫాంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకొని, పోలీసుశాఖ ప్రతిష్ఠను పెంచే విధంగా ప్రతీ పోలీసు ఉద్యోగి సత్ప్రవర్తనతో వ్యవహరించాలన్నారు. పోలీసుల కృషి ఫలితంగా జిల్లాలో నక్సలిజం పూర్తిగా సమసిపోయిందని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు ఉద్యోగులు ఎంతో సమర్ధవంతంగా పని చేస్తున్నారన్నారు. న్యాయం కోసం పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యను సహృదయంతో అర్ధంచేసుకొని, పరిష్కార మార్గాలను చూపాలన్నారు. ప్రజలకు పోలీసులు ఎప్పుడైతే మంచి సేవలను అందిస్తారో, సమాజంలో పోలీసువారి పట్ల గౌరవం మరింత పెరుగుతుందన్నారు. హెూంగార్డ్సు కూడా అనేక పోలీసు విధులను పోలీసులతో సమానంగా సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. హెూంగార్డు కూడా క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ఒక యూనిఫాం ఉద్యోగిగా ఇతరులకు పోలీసులు ఆదర్శంగా ఉండాలన్నారు. ఏ బాధ్యతలను, విధులను అప్పగించినా వాటిని ఎంతో క్రమశిక్షణ, అంకితభావంతో, బాధ్యతాయుతంగా నిర్వర్తించి, పోలీసు శాఖకు గౌరవాన్ని మరింతగా ఇనుమంటింపజేయాలని పోలీసు సిబ్బందికి జిల్లా దిశా నిర్దేశం చేసారు. ఎవరైనా విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా, వారిపై కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం, పోలీసు ఉద్యోగుల సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పోలీసు పరేడ్ గ్రౌండులో ఆర్మ్డ్ రిజర్వు పోలీసులు నిర్వహించిన సెరిమోనియల్ పరేడ్ నందు అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, రిజర్వు ఇన్స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్‌కుమార్, భగవాన్, పలువురు ఆర్.ఎస్.ఐ.లు, ఆర్మ్డ్ రిజర్వు సిబ్బంది, హెూంగార్డ్సు పాల్గొన్నారు.

## రెండవ పట్టణ సీఐగా శ్రీనివాసరావు బాధ్యతలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఇటీవలజరిగిన బదిలీల్లో భాగంగా 2వ పట్టణ పోలీసు స్టేషను ఇన్స్పెక్టర్‌గా టి.శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ విజయనగరం 2వ పట్టణ పీఎస్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల సిఐ దిశా నిర్దేశం చేసారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండో పట్టణ సిఐగా రావడం ఆనందంగా ఉందన్నారు. తన పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలలో సూక్ష్మస్థాయి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. దొంగతనాలు జరగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు వహిస్తామన్నారు. రానున్న కాలంలో అన్ని కళాశాలలో పాఠశాలలకు వెళ్లి యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

## సుప్రీం తీర్పు పై దళితులంతా ఐక్యత తో ఉండాలి

విశాలాంధ్ర -గరివిడి : మండలం లో మాల మహానాడు ఆధ్వర్యంలో సుప్రీం కోర్ట్ ఇచ్చిన వర్గీకరణ తీర్పు పై సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది ఈ సమావేశంలో తీర్మానం పార్టీలకు అతీతంగా ఏ ఒక్కరు స్వలాభవం కోసం గాని పని చేయకుండా మన మాల జాతి గురించి కష్టపడి పని చేయాలని అలాగే ఈ మండలంలో ఎన్ని సంఘాలు ఉన్నా వర్గీకరణ విషయంలో అందరం ఒకే తాటిపై నడిసి కలిసికట్టుగా పనిచేయాలని తీర్మానించడం జరిగినది ఈ కార్యక్రమంల గరివిడి మాల మహానాడు అధ్యక్షులు టోంపల. సంజీవరావు, ఉపాధ్యక్షులు. బూర. సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు, బోడ సింగి.పోలీస్ రేగాన. రామారావు, శ్రీ లోపింటి.రాంబాబు దళిత ఉద్యమం సీనియర్ నాయకులు పేకేటి. చంద్రావు , రిటైర్డ్ టీచర్ రేగాన. అప్పలనాయుడు మాస్టర్ , కార్యవర్ సభ్యులు, జరజాన. సూర్య రాములు లోపింటి. రమణ, వినోద్ కుమార్, జి దేవ మిగతా కార్యవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## శ్రీ పైడితల్లి ఆలయం లో కుంకుమార్చనలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీ పైడితల్లి అమ్మ వారి ఆలయం వనంగుడిలో అమ్మవారికి ఉదయం అభిషే కాలు నిర్వహించారు. అమ్మ వారికి చీరెలతో అలంకరణలు చేసారు. చదురుగుడిలో అమ్మ వారి ఆలయంలో అమ్మవారి కి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణ లు చేసారు. ఆలయంలో అధికసంఖ్యలో కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారి నిదర్శించుకున్నారు.దేవస్థానం ఆధ్వర్యంలో చదురు గుడివద్ద ప్రత్యేక రథంపై కొలువుతీరిన అమ్మవారికి ఆలయ వేదపండితులు సాయికిరణ్ శర్మ, తాతా రాజేష్ శర్మ లు పూజలు నిర్వహించారు. మహిళలచే సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మాట్లాడుతూ అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుందని. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఈ దినోత్సవం నిర్వహించాలని 1994లో ఐక్య రాజ్య సమితి ప్రకటించిందని ఆధునిక సమాజ గత కాలపు ఆనవాళ్ళు ఆదివాసీ ప్రజలు. సమిష్టి జీవన పద్ధతులు, పారదర్శకతకు నిలువెత్తు సాక్ష్యులు కూడా ఆదివాసీ ప్రజలే.ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ తెగల భాష, సంస్కృతులను కాపాడుకోనేందుకు ప్రభుత్వం తగిన ప్రోత్సహం అందించాలని కోరారు. చరిత్ర శాఖ ఉపన్యాసకులు చల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ బిఆదివాసీ ప్రజలు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానిని తగిన నిధులను ప్రభుత్వం కేటాయించి వివిధ పథకాలు ప్రవేశపెట్టాలని, వారి జీవితంలో ఆనందాలు నిండాలని ఆశిస్తూ ప్రతి విద్యార్థి మరి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశిస్తూ మీ యొక్క ఆశ సాధన కోసం ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కే వాసుదేవరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, ఎన్.ఎస్.ఎస్ పీవో డాక్టర్ జి ఈరన్న, చరిత్ర ఉపన్యాసకులు చల్లా శ్రీనివాసరావు, ఎన్సిసి ఆఫీసర్ ఎస్కే వలి ఖాన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరుస విధానమే వరికి రక్ష

విశాలాంధ్ర -మెరకముడిదాం: మండలంలో గల బాదాం గ్రామంలో లోగిశ పద్మజరాణి వ్యవసాయ క్షేత్రంలో లో వరినాట్లు రైతుల వరుస విధానంల (లైన్ షోయింగ్) పద్ధతి అవలంబిస్తే చీడ పీడల నుంచి రక్షణ పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయ అడిషనల్ డిపిఎం ఆర్ వి స్వామి నాయుడు అన్నారు. వరుస విధానములో వరి నాట్లు వేసే విధానంపై బాదాం లో రైతులకు శుక్రవారం నాడు ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. దోమపోటు ఇతర తెగులు నుంచి రక్షణ లభిస్తుందని కిరణ జన్యు సంయోగ క్రియ జరిగి. రైతులకు సమృద్ధిగా దిగుబడి రావడమనేది జరుగుతుంది. సూచనలు (కత్తిరించి) బీజామృతంతో వరి నారును శుద్ధి చేసి వరినాట్లను 15/9 అంగుళాలు మధ్య దూరం పాటించడం వ్యక్తులకు శ్రమ ఆదా, ఖర్చులు కూడా తగ్గుతాయి. ఈ కార్యక్రమంలో డిపిపి నీలిమ రైతు శాస్త్రవేత్త ఎల్ గగన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరినాయుడుకు సంస్కృతభారతి ఘన సన్మానం

విశాలాంధ్ర-లక్కవరపుకోట: కితన్నపేట గ్రామానికి చెందిన యువ సాహితీవేత్త, రచయిత, విశ్లేషకుడు రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ కిలారి గౌరి నాయుడు కి విశాఖపట్నంలో ఎస్‌వి.వి.పి.విఎంసి డిగ్రీ కళాశాలలో సంస్కృత భారతీయ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమానికి గౌరీ నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అని శుక్రవారం ఆయన స్థానిక విలేకరులకు మండల కేంద్రంలో తెలిపారు తెలిపారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో సాంస్కృత భాష అధ్యయనం ప్రాముఖ్యత అనే అంశంపై ప్రసంగించారని సంస్కృతం నేర్చుకోవడానికి, మాట్లాడడానికి కావలసిన మెలకువలను విద్యార్థులకు వివరించారు. సంస్కృతం నేర్చుకోవడం వల్ల అనువాద రంగంలో, విద్యారంగంలో ఉండే ఉపాధి అవకాశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత భారతీ సంస్థ ప్రతినిధులు నరసింహస్వామి, కే సూర్యకుమారి, వెంకటలక్ష్మి, బివి ఎల్ ఎన్ స్వామి, కళాశాల ప్రిన్సిపాల్ కే జగదీశ్వరరావు, అధ్యాపకులు తదితరులు గౌడ్ నాయుడుని ఘనంగా సన్మానించారని తెలిపారు బోధన, సాహిత్య, సాంస్కృతిక, కళా పరిశోధన రంగాలలో గౌడ్ నాయుడు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ కార్యవర్గ సభ్యులు రామసుందర్ లిటరరీ రెస్ట్ ప్రతినిధులు నాయుడికి అభినందనలు తెలిపారు. సాహితీమిత్రులు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు అని తెలిపారు.

## సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా క్విట్ కార్పొరేట్

విశాలాంధ్ర-బొబ్బిలి : ఢిల్లీలో జూలై 10న సమావేశమైన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం క్విట్ ఇండియా ఉద్యమం రోజైన ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ గా జరపాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా రైతు కూలీ సంఘం, పట్టణ కళాసి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కళాసి సంఘం ఆఫీస్ వద్ద నుండి చర్చి సెంటర్, మేదర బంధ, మార్కెట్ మీదుగా ఎన్టీఆర్ బొమ్మ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, పట్టణ కళాసి సంఘం కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ వ్యవసాయం, రిటైల్ వ్యాపార రంగంలోకి బడా సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలు చొరబడుతున్నాయని అన్నారు. ఇప్పటికే మాన్ శాంటో, బేయర్, సింజెంటా వంటి కంపెనీలు విత్తన, పురుగు మందుల రంగాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని ఈ కంపెనీలు తమకు ఇష్టం వచ్చినట్టు విత్తన, పురుగుమందుల ధరల రేట్లు పెంచుతూ పోతున్నాయని దీన్ని ప్రభుత్వాలు అదుపు చేయడంలో విఫలం చెందారని ఆరోపించారు. క్విట్ కార్పొరేట్ కార్యక్రమం అనంతరం తహశీల్దార్ ఎం.శ్రీనుకు తహశీల్దార్ కార్యాలయం లో గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బట్టి వలస, అక్కిన వలస, చిన్నక్కెనవలస, డొంగురు వలస, కాశయ్యవలస మొదలగు గిరిజన గ్రామాలలో నెలకొని ఉన్న రోడ్డు, మంచినీరు, కరెంటు సమస్యలను పరి ష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై మాట్లాడుతూ మూడునెలల్లో సమస్యలు పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్, సూరిబాబు, రాజు పట్టణ కళాసి సంఘం అధ్యక్షులు బోగాది అప్పలస్వామీ, నాయకులు అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

## ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి

విశాలాంధ్ర వేపాడ : భారతదేశానికి స్వతంత్రం వచ్చి 77 ఏళ్ళు గడుస్తున్న ఆదివాసిలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ప్రభుత్వాలు ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు వక్తలు నొక్కి వక్కాణించారు.మండల కేంద్రమైన వేపాడలో శుక్రవారం మండల గిరిజన సమైక్య నేతలు ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ఆదివాసి సమైక్య సంఘం అధ్యక్షుడు వంతు గౌరి నాయుడు,నియోజకవర్గం నేత వరపుల సన్యాసిరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆదివాసి దినోత్సవ వేడుకలలో గిరిజన నాయకులు కొప్పల అప్పారావు మాట్లాడుతూ ఆదివాసీలను రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వినియోగించుకోవడం తప్ప వారి అభివృద్ధికి పట్టించుకోని దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తీ చేశారు. దీంతో అనేది గ్రామాల్లో కనీస రోడ్డు సదుపాయాలు లేక విద్య వైద్యంకు ఆమడదూరంలో మగ్గిపోతున్నారన్నారు. కార్యక్రమంలో మండల దళిత నాయకులు కుంచి కోటేశ్వరరావు, దేబార్కి కిరణ్,గిరిజన నాయకులు బంగారయ్య, కొప్పల నరసింహమూర్తి, ఉగ్గిన ఈశ్వర రావు, పోతబంది దేముళ్ళు, చిన దుంగాడ, పెద దుంగాడ వెంకయ్యపాలెం, కొండ గంగుపూడి, కొలుకు పాలెం,తదితర గిరిజన నాయకులతోపాటు,వీలుపర్తి గ్రామ పెద్దలు శానాప తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మొదటి శ్రావణ శుక్రవార పూజ

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ గుణుపూర్ ఉభయగ్రామాలలో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో శ్రావణ మాస సందర్భంగా శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని దేవాలయంలో కొలువైయున్న లక్ష్మీ తాయారుకి అష్టోత్తర సహిత కుంకుమార్చననీ నిర్వహించారు భక్తులు కూడా వారి స్వహస్తాలతో అమ్మవారి చిత్రపటాలకి కుంకుమార్చన నిర్వహించారు శ్రావణ శుక్రవారం నాడు మహాలక్ష్మీని కుంకుమార్చన చేయడం ద్వారా దీర్ఘసుమంగళీ ప్రాప్తం చేకూరుతుందనీ సిరిసంపదలు వెల్లివిరుస్తాయని మనకు ఉన్న ఆర్థిక సమస్యలు తొలగిపోవాలంటే మహాలక్ష్మిని పూజించాలని శ్రావణమాసం వరలక్ష్మీవ్రతం చేసుకోవడం ఎంత విశిష్టత కలిగి ఉంటుందో మొదటి శ్రావణ శుక్రవారం కూడా అంతే ప్రాధాన్యత కలిగిఉంటుందనీ ఆలయ అర్చకులు తెలియజేశారు 16వ తేదీన రెండవ శ్రావణ శుక్రవారం కూడా ఈ విధంగానే అర్చన ఉంటుందని భక్తులందరికీ ఆహ్వానాన్ని ఇచ్చారు.

## గర్భిణీలకు ఉచితంగా భోజనం పంపిణీ

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని పిహెచ్‌సీలో ప్రతీ నెలా 9వ తేదీన గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న నేపధ్యంలో తనిఖీలకు వచ్చే మహిళలకు,వారి సహాయకులకు మధ్యాహ్నం భక్షజనం ఏర్పాట్లను స్థానిక సత్యసాయి భజనమండలి చేస్తోంది. దాతల సహకారంతో ప్రతీనెలా జరుగుతున్న ఈభోజన వితరణ కార్యక్రమంలో శుక్రవారం సైతం నిర్వహించారు. జామికి చెందిన ఎల్లమాంబస్వీట్స్ అధినేత గండి ప్రసాద్, విజయ దంపతులు తమ కుమారుడు ధనుష్ జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళలకు భోజన ఏర్పాట్లు చేసారు. ఈకార్యక్రమాన్ని పిహెచ్‌సి వైద్యాధికారి డా.సామ్రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి భజనమండలి అధ్యక్షుడు విన్నకోట సీతారామయ్య, గండి విజయ,ఎస్.రమణ, ఎం.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సీతంలో అంతర్జాతీయ యువ దినోత్సవం

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధి లో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ యువ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ ఏడాది థీమ్ అయిన ఎంపవరింగ్ యూత్ త్రు పాజిటివ్ యాక్షన్ పై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమం, యువతకు స్వీయాభివృద్ధి, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య రక్షణ మరియు విలువల ప్రోత్సాహం మొదలైన వాటిని పోషించేందుకు ప్రేరణనిచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్రహ్మకుమారీల రాజయోగ ధ్యాన ఉపాధ్యాయులు బి.కె మంజుషా మరియు బి.కె వైష్ణవి విచ్చేసారు. ఈ కార్యక్రమంలో కుమారి బి.కె మంజుషా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఆత్మ శక్తి మరియు సానుకూల చర్యలు మెరుగైన భవిష్యత్ నిర్మాణంలో ఎంత ముఖ్యమో తెలియజేశారు. యువత తమ సామర్థ్యాలను స్వీయ అభివృద్ధి కోసం వినియోగించుకోవడం మరియు సమాజం, పర్యావరణం పై సానుకూలంగా ప్రభావితం చేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అలాగే కుమారి బి.కె వైష్ణవి మాట్లాడుతూ వేగంగా మారుతున్న ఈ రోజుల్లో మంచి ఆరోగ్యం మరియు బలమైన నైతిక విలువలను పాటించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావుఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ప్రసంగకర్తల సందేశాలను మనసులో పెట్టుకుని, వాటిని ప్రతిరోజూ ఆచరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని విద్యార్థులను ప్రోత్సహించారు.సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి కూడా ఈ భావాలను పునరుద్ఘాటిస్తూ, భవిష్యత్ నేతలను తీర్చిదిద్దడంలో విద్య మరియు నైతిక విలువల ప్రాముఖ్యత ను విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయడంలో సీతం సివిల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం. భార్గవి కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో సివిల్, మెకానికల్, మరియు ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేరళ బాధితులకై విరాళాల సేకరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: సిపిఐఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేరళలోని వైనాడ్ బాధితుల కోసం పట్టణంలోని ప్రతి షాపుకు వెళ్లి విరాళాలు సేకరించడం జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వాయనాడు లో ప్రకృతి సృష్టించిన విభత్సవం అంతా ఇంతా కాదు ప్రతి ఒక్కరిని కలిచివేసిందని. ఇటువంటి కష్టతర సమయంలో బాధితులకు అండగా నిలవాలని షాపు షాపుకు వెళ్లి సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించడం జరిగిందని కేరళలోని వాయనాడులో తుఫాన్ దుర్ఘటన బాధితులకు సహాయార్థం వందలాదిమంది చనిపోయారు వందలాది సంఖ్యలో నిలువు నీడ లేకుండా పోయారు వందలాది మందికి గాయాల పాలయ్యారు తుఫాన్ దుర్ఘటన కారణంగా వేలాది మందికి నష్టం జరిగింది ఆ నష్టాన్ని ఎవ్వరిమీ పూడ్చలేం కానీ మానవత దృక్పథంతో మన ప్రాంతం నుండి కొంత ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సహకారం ఆ బాధితకుటుంబాలకుఅందించాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టడంజరిగింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు, సిపిఎం నాయకులు చల్ల జగన్, గోల్ల సత్యనారాయణ, గమ్మెల సన్యాసిరావు, సిధరీ తదితరులు పాల్గొన్నారు. మొత్తం కలెక్షన్ అయినా సొమ్ము రూ.1856 అని ఆయన తెలిపారు.

## వావిలపాడు ఎస్.ఎం.సి ఎన్నికలలో టిడిపి అభ్యర్థులు విజయం

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ మండల ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు.నిబంధన మేరకు పిల్లల తల్లిదండ్రులు తమ అనుకూల వ్యక్తులకు చేతులు పైకెత్తి చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నుకోవాల్సి ఉండగా తల్లిదండ్రుల కోరిక మేరకు ఓటింగ్ విధానంగా నిర్వహించమని తమకు అనుకూలమైన వ్యక్తులను ఎన్నుకున్నారు.జిల్లా పరిషత్ హై స్కూల్ కి సంబంధించి టిడిపి అభ్యర్థిగా బి.వెంకటలక్ష్మి నిలబడగా వైసిపి నుండి కోయినాని శ్రీనివాసరావు నిలబడ్డారు.ఈ మేరకు జిల్లా పరిషత్తు హైస్కూల్లో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి బి. వెంకటలక్ష్మి (హై స్కూల్ చైర్మన్ గా), గండి వరలక్ష్మి(వైస్ చైర్మన్ గా ) ఎన్నికయ్యారు.అలాగే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కూడా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో కడియాల గంగు నాయుడు (చైర్మన్ గా) పోడుగు రాము (వైస్ చైర్మన్ గా) ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్య లక్ష్మి,లక్ష్మీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల అనంతరం గెలుపొందిన అభ్యర్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల యాజమాన్యం కమిటీ ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులను గ్రామ టిడిపి నాయకులు గుంటపల్లి దేముడు నాయుడు గోగాడ జగన్నాథం నాయుడు, పాల సంఘం అధ్యక్షులు గండి నారిబాబు,వేచలపు ముత్యాల నాయుడు, బండారు కృష్ణ,బొడ్డు వెంకటరావు,మిడతాడ వెంకటరావు, నాగిరెడ్డి దేముడు నాయుడు, జి. దేముల్లు,రామకృష్ణ,అగరకంటీ రవి గండి దేముడు, నిరుజోగి నాగమనాయుడు తదితరులు అభినందించారు.

## విజయనగరం జిల్లా చీపురుపల్లిలో బ్రాంచ్‌ను ప్రారంభించిన ఐసీఐసీఐ బ్యాంకు

విశాలాంధ్ర -విజయనగరం: ఐసీఐసీఐ బ్యాంక్ కొత్తగా విజయనగరం జిల్లా చీపురుపల్లి డివిజన్‌లో తమ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసింది. రాధికా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ మానవేంద్ర మోర్ ఈ శాఖను ప్రారంభించారు. ఈ డివిజన్‌లో బ్యాంకునకు ఇది తొలి బ్రాంచ్ కాగా జిల్లాలో అయిదోదని, ఈ బ్రాంచ్‌లో ఏటీఎం కూడా ఉంటుందని బ్యాంకు రీజినల్ ప్రతినిధి చెప్పారు. సేవింగ్స్, కరెంట్ అకౌంట్స్, ఫిక్స్‌డ్ రికరింగ్ డిపాజిట్లు వంటి ఖాతాలు, డిపాజిట్లతో పాటు వ్యాపార రుణం, గృహ రుణం, వ్యక్తిగత రుణం, వాహన రుణం, విద్యా రుణం తదితర రుణాలు, అలాగే రెమిటెన్స్ కార్డ్ సర్వీసులను మొదలైన విస్తృత శ్రేణి సేవలను ఈ బ్రాంచ్ సమగ్రంగా అందిస్తుందన్నారు. ప్రాంగణంలో లాకర్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ శాఖ సోమవారం నుంచి శుక్రవారం వరకు, నెలలో మొదటి, మూడో, అయిదో శనివారాల్లో ఉదయం 9.30 గం.ల. నుంచి సాయంత్రం 3.00 గం.ల వరకు పని చేస్తుందన్నారు. ఉద్యోగి ట్యాబ్లెట్ డివైజ్ ద్వారా కస్టమరు ఉన్న చోటే దాదాపు 100 సర్వీసులను అందించడానికి వీలు కల్పించే ట్యాబ్ బ్యాంకింగ్ సదుపాయాన్ని కూడా ఈ శాఖ అందిస్తుందన్నారు. ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) తెరవడం, చెక్ బుక్ రిక్వెస్ట్ రైజ్ చేయడం, ఈ-స్టేట్‌మెంట్స్ జనరేట్ చేయడం, చిరునామా మార్పులు మొదలైన సర్వీసులు ఇందులో లభిస్తాయని చెప్పారు.

## పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నిక

విశాలాంధ్ర -డెంకాడ: గురువారం జరిగిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల్లో డెంకాడ మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాల (అక్కివరం) జరిగిన ఎన్నికల్లో పాఠశాల చైర్మన్ కంది అప్పలనాయుడు వైస్ చైర్మన్ సింహాచలం 13 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య తెలిపారు.

## ప్రజల అభివృద్ధికి సహాయపడాలి

విశాలాంధ్ర-తెర్లాం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి బ్యాంక్ అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెర్లాం మండల కేంద్రం లో పాల్గొన్న ఎమ్ డి ఎల్ వి.వి.రమణమూర్తి పాల్గొన్నారు. బ్యాంకర్ల ద్వారా ప్రజల అభివృద్ధి కి సహాయ పడాలని, మన మండలం లో ఏ ఏ బ్యాంకులు ఉన్నాయో ఆ బ్యాంకుల్లో పనిచేస్తున్న మేనేజర్లు కానీ, సిబ్బంది కానీ వెలుగు డిపార్ట్మెంట్ డ్వాక్రా సంఘాల్లో పని చేస్తున్న సి సి లు కలుపుకొని, డ్వాక్రా సంఘాల ద్వారా ప్రజలకు బ్యాంకుల నుంచి రుణాలు అందించేందుకు బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. అలాగే బ్యాంక్ నుంచి కొంతమంది డ్వాక్రా సంఘాల గ్రూప్ లను ఎస్‌బిఐ బ్యాంకుల్లో క్లోజ్ చేసుకుంటున్నారని, ఎంత చెప్పిన వినడం లేదని, క్లోజ్ చేసిన గ్రూప్ లు వేరే బ్యాంక్ కు వెళ్లి లోన్లు పెట్టుకుంటున్నారని అలా జరగకుండా బ్యాంక్ లో పనిచేస్తున్న సిబ్బంది చూడాలని, అలాంటప్పుడు మన బ్యాంక్ మీద ప్రజలకు నమ్మకం పోతుంది అని అన్నారు. సమావేశంలో తెర్లాం ఎమ్‌డిఓ మధుసూదనరావు మాట్లాడుతూ గతం లో బ్యాకర్లకు, ప్రజలకు నిత్యం లావాదేవీలు ద్వారా జరిగేవని అలా కాకుండా ఇప్పుడు బ్యాంకర్ల కు ప్రజలకు ట్రాజెక్షన్స్ జరగడం పెద్దగా లేదని, రకరకాల పరికరాలుతో లావా దేవీలు బయటే జరుగుతున్నాయి అని అన్నారు. కార్యక్రమం లో ఎమ్ డి ఎల్ రమణమూర్తి, ఎమ్ డి ఓ మధుసూధనరావు,బ్యాంక్ మేనేజర్లు, కింద స్థాయి సిబ్బంది, తెర్లాం, బాడంగి రెండు మండలాల వెలుగు డిపార్ట్మెంట్ సి సి లు,కింద స్థాయి సిబ్బంది ఈ సమావేశం లో పాల్గొన్నారు.

## మహా శిల్పంపై దాడిని ఖండిస్తూ నిరసన

విశాలాంధ్ర-రాజాం: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, కూటమి ప్రభుత్వం నిన్న రాత్రి విజయవాడ నడిబొడ్డున గల అంబేద్కర్ విగ్రహ శిలా ఫలకాన్ని సుత్తులతో, ఇతర పరికరాలతో దాడి చేసిన ఘటనకు నిరసనగా నేడు రాజాం నియోజకవర్గ కేంద్రంలో రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ ఇంచార్జి డా. తలే.రాజేష్ సారధ్యంలో పార్టీ శ్రేణులతో కలిసి చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా స్థానికంగా అంబేద్కర్ కూడలి వద్ద గల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ దుచ్చర్యను వైసిపి పార్టీ ఖండిస్తుంది అని ఇది రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కి జరిగిన అవమానంగా భావిస్తూ నేడు యావత్ రాష్ట్రంతో పాటు మన నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పాలభిషేకం చేసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగినది అని డా. తలే.రాజేష్ మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస.శ్రీనివాసరావు, రూరల్ కన్వీనర్ లావేటి. రాజగోపాల్ నాయుడు, జడ్పిటిసి బండి.నరసింహులు, పిఎసిఎస్ అధ్యక్షులు వాకముల్ల.చిన్నం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బూకిపేటలో వివాహ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర -తెర్లాం: మండలం లో మండలంలో శుక్రవారం బూరిపేటలో కొండ్రు. రామ్మోహన్రావు వివాహానికి బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనా హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయుటకు కృషి చేస్తానని ఆయన సమాధానం ఇచ్చారు.

## బొబ్బిలి షుగర్ కేన్ గ్రోయర్ కోపరేటివ్ క్రెడిట్ చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శి లు ఏకగ్రీవం



విశాలాంధ్ర-బొబ్బిలి: ది బొబ్బిలి షుగర్ కేన్ గోయర్స్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకొన్నారు. చైర్మన్‌గా సబ్బాన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా బేతనపల్లి సత్యం, కార్యదర్శిగా యాళ్ళ శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు విలేకరులకు తెలిపారు.

## ఆగస్టు 15 సందర్భంగా హైస్కూల్లో ఆటలు పోటీలు

విశాలాంధ్ర - రామభద్ర పురం : ఈనెల ఆగస్టు 15 సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు శుక్రవారం ఆటలు పోటీలు డ్రిల్ మాస్టారు లు వెంకట్ నాయుడు శ్రీదేవి నిర్వహించారు. కబడ్డీ, కోకో, రన్నింగ్, హై జంపు, లాంగ్ జంప్, డిస్క్ త్రో, జావలిన్ త్రో, వాలీబాల్ తదితర గేములు నిర్వహించారు. ఈ గేముల లో గెలుపొందిన వారికి స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేయడం జరుగుతుందని హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు తెలిపారు.

## సర్పంచ్, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో ఉన్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12, 13, 14 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో శానిటేషన్, స్ట్రీట్ లైట్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట అంశాలపై మూడురోజుల పాటు శిక్షణకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు.

## జిల్లా ఎస్పీని కలిసిన గజపతినగరం సిఐ రమణ

విశాలాంధ్ర- విజయ నగరం టౌన్: జిల్లాలో గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన జి.ఎ.వి.రమణ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ను మర్యాద పూర్వకంగా కలిసి, పూల మొక్కను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ గజపతినగరం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతల పట్ల సిఐ కు దిశా నిర్దేశం చేసారు.

## విద్యార్థులకు డ్రోన్లపై అవగాహన

విశాలాంధ్ర -నెల్లిమర్ల: సమాజంలో డ్రోన్ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి సూపర్బీ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డ్రోన్ టెక్నాలజీ హెడ్ పి.నాగ ప్రవీణ్ వివరించారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయం లో మెకానికల్ ఇంజనీరింగ్, సిఎస్ఇ విద్యార్థులకు డ్రోన్లలో రకాలు, డ్రోన్లు ఎలా పనిచేస్తాయి? అనే అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, విభాగాధిపతి డాక్టర్ ఎస్వీఎస్కె దీపక్ కుమార్, ప్రాజెక్టు అసోసియేట్ ఆర్.సూర్యతేజ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్రత్ కుమార్ పరిడా, కురిటి జోగినాయుడు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డుకి ఇరువైపులా జంగిల్ తొలగింపు

విశాలాంధ్ర -వేపాడ: మండలం లోని జాకేరు గ్రామం నుండి సోంపురం వెళ్లే ఆర్.అండ్.బి రహ దారికి ఇరువైపులా జంగిల్ పెరిగి ప్రయాణికులకు వాహనాచోదకులకు, ఇబ్బందికరంగా మారడంతో స్పందించిన జాకేరు గ్రామ సర్పంచ్ దంపతులు బుద్ధ చిన్నమ్మలు అప్పల నాయుడులు తన సొంత నిధులతో జెసిబి ఏర్పాటుచేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు డొంకలను తొలగించారు.వారి ఉదార స్వభావానికి గ్రామస్తులతో పాటు ప్రయాణికులు వాహన చోదకులు వారిని అభినందించారు.ఈ జంగిల్ తొలగింపు కార్యక్రమంలో గ్రామానికి చెందిన జనసేన నాయకుడు సలాది నరేంద్ర,బుద్ధ కృష్ణలు ఉన్నారు.